క్లుప్తంగా

జీవిత బీమాతో ఆర్థిక భరోసా

ఒంగోలు సెంట్రల్: జీవిత బీమా నగదుతో ఆపద సమయంలో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం తపాలా శాఖ కార్యాలయంలో శుక్రవారం గ్రూప్ ఇన్సూరెన్స్ బీమా నగదు చెక్కును బాధిత కుటుంబానికి ఆయన అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మేదరమెట్ల గ్రామానికి చెందిన గుడిపాటి బ్రహ్మాజీ రూ.399తో పోస్టల్ జీవిత బీమా తీసుకున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ఆయన మృతి చెందారు. ఆయన భార్య గుడిపాటి అరుణకు రూ.10 లక్షల విలువైన బీమా చెక్కును ఎంపీ చేతుల మీదుగా అందించారు. పోస్టల్ డివిజన్ ఎస్ఎస్‌పీ ఎండీ జాఫర్ సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఒంగోలు: డయల్ యువర్ డిపో మేనేజర్ (డీఎం) కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.


జేసీఐ ద్వారా ఉత్తమ సేవలు అందించాలి



అగర్వాల్‌ను సన్మానిస్తున్న జేసీఐ ప్రతినిధులు

ఒంగోలు సెంట్రల్: జేసీఐ ద్వారా ఉత్తమ సేవలు అందించి సమాజంలో గుర్తింపు పొందాలని జేసీఐ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జేఎఫ్‌జీఆర్ అగర్వాల్ అన్నారు. స్థానిక హైదరీ క్లబ్‌లో శుక్రవారం జేసీఐ ఒంగోలు అధ్యక్షుడు వరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలులో చేపడుతున్న కార్యక్రమాలను అధ్యక్షుడు వివరించారు. ఉత్తమ సేవలు అందించిన వారిని అభినందించి సన్మానించారు. అనంతరం అగర్వాల్‌ను సన్మానించారు. జేసీఐ జోన్ ప్రెసిడెంట్ కృష్ణ భాస్కర్, ఎన్‌వీపీ టూర్ కో ఆర్డినేటర్ సాయి, సెక్రటరీ శ్రీకాంత్, ట్రెజరర్ నరేంద్రకుమార్, నేషనల్ మాజీ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, జోన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, జోన్ డైరెక్టర్ రామాంజనేయులు, ఒంగోలు వైస్ ప్రెసిడెంట్ శబరీనాథ్, మాజీ వైస్ ప్రెసిడెంట్లు దాసరి కృష్ణారావు, సుబ్రహ్మణ్యం, జేసీఐ సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరిగా శ్రీ వేప అంకమ్మ తల్లి



శాకంబరీదేవి అలంకరణలో వేప అంకమ్మ తల్లి

ఒంగోలు మెట్రో: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక సీతారాంపురం వేప అంకమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దేవస్థానం నిర్వాహకురాలు సరస్వతి మాట్లాడుతూ శ్రావణమాసం నాలుగు శుక్రవారాలు అమ్మవారు వివిధ అలంకరణలలో భక్తులను అనుగ్రహిస్తున్నారని తెలిపారు. తొలి శుక్రవారం వేప అంకమ్మ తల్లిగా, రెండో శుక్రవారం శ్రీ వరలక్ష్మీ తల్లిగా అనుగ్రహించారని చెప్పారు. మూడో శుక్రవారం శాకంబరిగా కొలువుదీరారని, నాలుగో శుక్రవారం అయిన ఈ నెల 30వ తేదీ గాజుల అలంకరణలో అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తారని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

శివాలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న సత్యనారాయణమూర్తి

ఒంగోలు మెట్రో: స్థానిక రంగారాయుడు చెరువు వద్ద పునర్నిర్మాణంలో ఉన్న భువనేశ్వరీ సమేత పశుపతీశ్వరాలయానికి పెమ్మరాజు సత్యనారాయణమూర్తి శుక్రవారం రూ.లక్ష విరాళం అందించారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి సభ్యుడు మద్దులూరి హరిప్రేమనాథ్‌కు ఆ మొత్తాన్ని అందించారు. సత్యనారాయణమూర్తిని ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు అభినందించారు.



కఠిన చట్టాలు తేవాలి

ప్రాణం పోసేవారికి రక్షణ కల్పించాలి. వైద్యులపై దాడులు జరిగితే తీసుకునే చర్యలు తీవ్రంగా ఉండేలా కఠిన చట్టాలు తీసుకురావాలి. వైద్యుల జోలికొస్తే భయపడేలా ఆ చట్టాలు ఉండాలి.

– డాక్టర్ బ్లెస్సీ, చందలూరు పీహెచ్‌సీ వైద్యురాలు





మహిళా కానిస్టేబుల్‌ను నియమించాలి

రోజు రోజుకూ మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే మహిళా సిబ్బందికి రక్షణ కల్పించటం ఎంతో అవసరం. నైట్ డ్యూటీల్లో పనిచేసే సిబ్బంది రక్షణ కోసం లేడీ కానిస్టేబుల్‌ను నియమించాలి. అలా కాని పక్షంలో కనీసం మహిళా హోంగార్డులను అయినా నియమించగలిగితే నైట్ డ్యూటీలకు వెళ్లే మహిళా సిబ్బందికి ఎంతో ధైర్యంగా ఉంటుంది. దీంతో పాటు వైద్యశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు మద్యం తాగి వైద్యశాలలో సంచరిస్తున్నారని సిబ్బంది ఫిర్యాదు చేస్తున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి పటిష్ట సెక్యూరిటీ అవసరం.

– వి.నాగమహేశ్వరి, సూపరింటెండెంట్, సామాజిక ఆరోగ్యకేంద్రం, పెద్దదోర్నాల



వినోదరాయునిపాలెంలో ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేస్తున్న జేసీ, ఎమ్మెల్యే, అధికారులు



ట్రిపుల్ ఐటీ కాలేజీలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



వినోదరాయునిపాలెంలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

మహనీయుడు.. టంగుటూరి

- జేసీ రోనంకి గోపాలకృష్ణ
- ఘనంగా ప్రకాశం పంతులు జయంతి వేడుకలు
- స్వగ్రామం వినోదరాయునిపాలెంలో నివాళులు

నాగులుప్పలపాడు:

దేశం గర్వించదగిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని జేసీ రోనంకి గోపాలకృష్ణ కొనియాడారు. శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన జన్మస్థలమైన నాగులుప్పలపాడు మండలంలోని వినోదరాయునిపాలెం గ్రామంలో ప్రభుత్వం తరపున వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, అధికారులు, నాయకులతో కలిసి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలతో జేసీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో బ్రిటీష్ వారితో అలుపెరుగని పోరాటం చేయడంతో పాటు ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయి కూడా సాధారణ జీవితం గడిపి దేశ ప్రయోజనాల కోసం తన జీవితాంతం నిలబడిన వ్యక్తి ప్రకాశం పంతులు అని వివరించారు. అలాంటి మహనీయుడు నాగులుప్పలపాడు మండలంలోని వినోదరాయునిపాలెం గ్రామంలో పుట్టడం మనందరికి గర్వకారణమని అన్నారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమణి, ఎంఈవో రవి, గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్, ప్రధానోపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ కాలేజీలో...

చీమకుర్తి: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కాలేజీ ఆవరణలో అధ్యాపకులతో కలిసి ఇంజినీరింగ్ విద్యార్థులు శుక్రవారం వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు యోగా విన్యాసాలు ప్రదర్శించారు. వాటితో పాటు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ భాస్కర్ పటేల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తిలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య పోరాటంలో చేసిన త్యాగాలు, సేవలను కొనియాడారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు, జాతీయ అంతరిక్ష దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నిమిషం పాటు మౌనం పాటించారు. ప్రకాశం పంతులు జీవిత చరిత్ర గురించి రమేష్ వివరించారు. ఆయన పడిన కష్టాలు, చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు మెలగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ హరిబాబు, సైన్సు ఉపాధ్యాయుడు పర్రె వెంకట్రావు, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ధనలక్ష్మి, పద్మశ్రీ, ఉమామహేశ్వరి, చంద్ర, నాగమల్లేశ్వరరావు, షకీలా, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు లాయర్‌పేటలో...

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్‌పేట రైతు బజార్ వద్ద ఉన్న ప్రకాశం పంతులు కాంస్య విగ్రహానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నగర మేయర్ గంగాడ సుజాత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విగ్రహానికి బ్రాహ్మణ నాయకుడు, విగ్రహదాత పొన్నలూరి శ్రీనివాసఫణి, కుసుమకుమారి, రాజేష్, గంజాం రంగనాథ్, ధేనువకొండ సుబ్బయ్య, సాక్షి సుజాత నివాళులర్పించారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు వద్ద గల శుభప్రదం కమ్యూనిటీ భవనంలో సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య, ట్రెజరర్ పూర్ణచంద్రరావు, సభ్యుడు మైనంపాటి సాయి, మేనేజర్ నాగేశ్వరరావులు ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు.



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న స్థానికులు



కొత్తపట్నం హైస్కూల్లో ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు



లాయర్‌పేటలో ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ నాయకులు

భూసారం ఆధారంగా ఎరువులు వాడాలి

- జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శేషమ్మ

కొత్తపట్నం: వ్యవసాయ భూముల్లో భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా మాత్రమే ఎరువులు వాడుకుంటే దిగుబడులు ఎక్కువగా రావడమే కాకుండా పెట్టుబడులు తగ్గుతాయని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వి.శేషమ్మ అన్నారు. ఆత్మ 2024–25 ఫార్మర్ ఓరియెంటెడ్ యాక్టివిటీ కింద స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం ఒంగోలు అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఎరువులు, పురుగు మందులను రైతులు విచక్షణా రహితంగా వాడటం వలన నేల, గాలి, నీటి కాలుష్యంతో పాటు సాగు ఖర్చులు పెరిగి రైతులకు నికర ఆదాయం తగ్గిపోతోందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి సిఫార్సు మేరకు మాత్రమే వినియోగించుకోవాలని వివరించారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, జీవ శిలీంద్ర నాశినులు, వేప కషాయం, వేప నూనె లాంటి ప్రకృతి వనరులను వినియోగించడంతో పాటు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిని ఎ.శైలజరాణి మాట్లాడుతూ మట్టి నమూనా తీసే విధానం, మట్టి పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకం, సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సీహెచ్ రెడ్డప్ప, మండల ట్రైనర్ నరసింహాలు మాట్లాడుతూ వ్యవసాయంలో పంటలు పండించేందుకు వాడే జీవామృతాలు, కషాయాల గురించి వివరించారు. బీజామృతం, నీమాస్త్రం తయారు చేసే విధానాన్ని చేసి చూపించారు. మండల వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి తెలుగులో ప్రచురించిన కరదీపికలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో సీహెచ్ అజయ్, వీఏఏ కల్పన, రైతులు పాల్గొన్నారు.



ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ ఇస్తున్న జిల్లా వనరుల కేంద్రం అధికారి శేషమ్మ

ఎస్ఎన్‌జీపై హెచ్‌ఎంలకు అవగాహన అవసరం

- ఉప విద్యాశాఖాధికారి సుబ్బారావు

ఒంగోలు: స్కూల్ న్యూట్రీషియన్ గార్డెన్ (ఎస్ఎన్‌జీ)పై హెచ్‌ఎంలకు అవగాహన అవసరమని ఉప విద్యాశాఖాధికారి సామా సుబ్బారావు అన్నారు. ఒంగోలు డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయులకు స్థానిక సమగ్రశిక్ష సమావేశ మందిరంలో శుక్రవారం ఎస్ఎన్‌జీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎస్ఎన్‌జీ ఉపయోగాలు, యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు విద్యాశాఖలో అమలవుతున్న పథకాలకు ప్రభుత్వం తాజాగా మార్చిన పేర్ల గురించి వివరించారు. స్పెషల్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్–1 పరీక్షల నిర్వహణ, టైంటేబుల్ గురించి వివరించారు. సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలన్నారు. దీనిపై జిల్లా స్థాయి కమిటీ పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఆఫీసర్ సుభాషిణి, కేవీకే తరఫున హార్టీకల్చర్ ఆఫీసర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి సుబ్బారావు

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పనులు చేపట్టి అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే పంట కాలువల తవ్వకాలు, సైడు కాలువలు, పూడికతీత పనులు వంటివి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రఘుబాబు, సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, ఎంపీటీసీ కోటిరెడ్డి, కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

27న శ్రీగిరిలో గోకులాష్టమి వేడుకలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీ గోకులాష్టమి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సి.వి.రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు గో పూజ, యాదవ రాజుల సన్మాన కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

వినాయక చవితి కార్యక్రమాలకు శ్రీకారం

ఒంగోలు మెట్రో: నగరంలో 27, 30 డివిజన్ల పరిధిలోని సీతారాంపురం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం వద్ద దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో 30 సంవత్సరాలుగా గణపతి నవరాత్రి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సెప్టెంబర్ 7వ తేదీ వినాయకచవితి పండుగను పురస్కరించుకుని గణపతి నవరాత్రి మహోత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ముందుగా శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి సుబ్రహ్మణ్యశర్మ వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి నవరాత్రి ఉత్సవాల మండపానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ధనిశెట్టి రామునాయుడు, బేతనమూడి సాయికుమార్, ఇందుర్తి పవన్ విగ్నేష్, వాకాటి వెంకటేష్, అఖిశెట్టి నాగార్జున, నారాయణ, రాజు, రవి, నాయుడు, శివరామకృష్ణ, ఇందుర్తి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గణపతి నవరాత్రుల మండపానికి భూమి పూజ చేస్తున్న నిర్వాహకులు

విజయ గణపతి సప్తమ వార్షికోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీనగర్‌కాలనీ మొదటి లైన్‌లోని విజయ గణపతి క్షేత్రంలో స్వామివారికి ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్న సప్తమ వార్షికోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు.

భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని అనుగ్రహానికి పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నగరంలోని అమ్మవారి దేవాలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థానాల నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు